క్లుప్తంగా

16న పల్లెపల్లెకూ గొల్లపల్లి ప్రచారయాత్ర

సఖినేటిపల్లి: ఈ నెల 16వ తేదీ మంగళవారం పల్లె పల్లెకూ గొల్లపల్లి, గొల్లపల్లి రావాలి-అభివృద్ధి కావాలి అనే నినాదంతో వైఎస్సార్ సీపీ రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు మండలంలో ప్రచార యాత్ర చేయనున్నట్టు ఆ పార్టీ మండల కమిటీ ఆదివారం తెలిపింది. ఈ మేరకు ప్రచార యాత్ర షెడ్యూల్‌ను పార్టీ విడుదల చేసింది. ఆ తేదీన సఖినేటిపల్లిలంక గ్రామం నుంచి ఉదయం మొదలయ్యే ఈ ప్రచార యాత్ర అదే రోజు రాత్రి అంతర్వేదికరలో ఎన్నికల కోడ్ ప్రకారం ముగిసే విధంగా పార్టీ రూపొందించింది. ఈ ప్రచార యాత్ర గొల్లపల్లి నిర్వహించనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ యాత్రలో ఆయా గ్రామాల్లోని పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కమిటీ కోరింది.

22న విప్పర్తి నామినేషన్

పి.గన్నవరం: పి.గన్నవరం ఎమ్మెల్యే స్థానానికి ఈనెల 22వ తేదీ ఉదయం 11 గంటలకు స్థానిక ఆర్ఓ కార్యాలయంలో తాను నామినేషన్ వేస్తున్నట్టు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నామినేషన్ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులంతా తరలి రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రణాళికాబద్ధంగా ఓటింగ్ జరిగేలా చూడాలి



అప్పనరామునిలంకలో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమంలో కన్వీనర్లు, గృహసారథులు, కోర్ కమిటీ సభ్యులు

సఖినేటిపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అన్ని వర్గాల వారి ఓట్లు ప్రణాళికబద్ధంగా ఓటింగ్ చేయించుకునేలా చూడాలని జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నల్లి మోహన్ అన్నారు. ఆదివారం అప్పనరామునిలంకలో బూత్‌లలో ఓటింగ్ శాతం పెంచేందుకు తీసుకోవాల్సిన విధానాలపై ఆయన అవగాహన కల్పించారు. పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బర్రే రాము ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, బూత్ కోర్ కమిటీ సభ్యులతో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం పేరుతో జరిగిన సమావేశంలో మోహన్ మాట్లాడారు. సిద్ధం కిట్లను ఎంపీపీ వీరా మల్లిబాబు, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, సర్పంచ్ ఇందుకూరి సుబ్బరాజు వారికి అందజేశారు. అలాగే బూత్‌లలో ఒకటి ఎమ్మెల్యే ఎన్నిక నిమిత్తం అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావుకు, రెండోది పార్లమెంట్ ఎన్నిక నిమిత్తం అభ్యర్థి రాపాక వరప్రసాదరావుకు ఫ్యాన్ గుర్తులపై రెండు ఓట్లు వేసేలా ఓటర్లుకు వివరించాలని మోహన్ కోరారు. నాయకులు చొప్పల రాజబాబు, తాడి సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.25 వేల విరాళం



అంతర్వేది ఆలయంలో స్వామి చిత్రపటం అందుకుంటున్న దాత రామారావు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో ఆదివారం నిత్యాన్నదాన ట్రస్టుకు కేశవదాసుపాలేనికి చెందిన బెల్లంకొండ రామారావు-నాగమణి దంపతులు రూ.25,000 విరాళం అందజేశారు. ఈ మేరకు ఆలయంలో అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణకు పై మొత్తాన్ని ఇచ్చి, స్వామివారి చిత్రపటం, ప్రసాదాన్ని వారు అందుకున్నారు. ఆలయ సూపరింటెండెంట్ పి.విజయ సారథి పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల జాతర

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న గ్రామ దేవతలు కొత్తమ్మ, పళ్లాలమ్మ అమ్మవార్ల జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమ పూజలు చేసి అనంతరం నైవేద్యాలు చెల్లించారు. ఈ సందర్భంగా అమ్మవార్లను ప్రత్యేకంగా పూలమాలలతో అలంకరించారు. అనంతరం గరగ నృత్యాలతో అమ్మవార్లకు గ్రామోత్సవం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

ఘనంగా రుద్రహోమం

ఐ.పోలవరం: మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకస్వామి పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో పలువురు పండితులచే ఆదివారం పరమశివుని జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని రుద్ర హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవాచనం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ పండితులు నాగాభట్ల రామకృష్ణమూర్తి ఆధ్వర్యంలో పలువురు పండితులచే గంగలకుర్రు గ్రామానికి చెందిన జయంతి సుబ్రహ్మణ్యం దంపతులు స్వామివారికి లక్ష బిల్వార్చన నిర్వహించారు.



చింతలమోరిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు



పాశర్లపూడిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి



కొత్తపేట మండల పరిషత్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎంపీపీ మార్గని



సఖినేటిపల్లి ఎంఈవో కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు



కొత్తపేటలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న అముడా చైర్మన్ దేవిడ్‌రాజు

అంబేడ్కర్ ఆశయాలు దేశానికి ఆదర్శం

- నివాళులర్పించిన ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రాపాక, విప్పర్తి, చిర్ల, గొల్లపల్లి
- వాడవాడలా జయంతి వేడుకలు



సంధిపూడిలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పించిన ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

మలికిపురం: అంబేద్కర్ వల్లే దేశంలో పేదలందరి అభివృద్ధి సాధ్యపడిందని రాజోలు ఎమ్మెల్యే, అమలాపురం ఎంపీ అభ్యర్థి రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. ఆదివారం మలికిపురంలో పూలే-అంబేద్కర్ భవనం వద్ద అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే నేడు పేదలు దర్జాగా బ్రతుకుతున్నారని అన్నారు. అధికారం ప్రజల చేతుల్లో ఉండాలని ఆకాంక్షించి ఆ దిశగా ఎన్నో కష్టాలను ఎదుర్కొని రాజ్యాంగం సాధించిన వ్యక్తి అంబేద్కరని ఆయన అన్నారు. చింతలమోరిలో కూడా ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో కేఎస్ఎన్ రాజు, దొమ్మేటి ఉమా మహేశ్వర రావు, సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, నల్లి శివకుమార్, గుబ్బల బాబ్జి, చింతా రాజబాబు, గెడ్డం తులసీ భాస్కరరావు, ముప్పర్తి త్రిమూర్తులు, మోకా దివాకర్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాలలోనూ అంబేద్కర్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు.

ఆలమూరులో..

ఆలమూరు: భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలు, ఆలోచన విధానాలు దేశానికి ఆదర్శప్రాయమని కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని సంధిపూడి, చింతలూరు గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన అంబేద్కర్ జయంతిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి, అంటరానితనం నిర్మూలనకు ఆయన చేసిన సేవలు మరువలేమన్నారు. ఎంపీపీ కార్యాలయంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతా మహాలక్ష్మి, ఎంపీడీఓ ఎ.మేరీ రోజ్, ఏఎంసీ కార్యాలయంలో చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, అలాగే మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, పలు గ్రామాల్లో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు అన్నసమారాధనలు నిర్వహించి తమ అభిమానాన్ని చాటుకున్నారు.

పాశర్లపూడిలో..

మామిడికుదురు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదర్శనీయుడని పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు కీర్తించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆదివారం పాశర్లపూడిలో విగ్రహానికి వేణుగోపాలరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తోలేటి ఆదినారాయణమూర్తి, చిక్కం బుజ్జిబాబు, పిల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. మండలంలోని ప్రతి గ్రామం, పేటల్లోనూ అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా పలు చోట్ల అన్న సమారాధనలు ఏర్పాటు చేశారు.

సఖినేటిపల్లిపాలెంలో..

సఖినేటిపల్లి: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను నూటికి నూరు శాతం సీఎం జగన్ సాకారం చేశారని వైఎస్సార్ సీపీ రాజోలు అసెంబ్లీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఆదివారం సఖినేటిపల్లిపాలెం సెంటర్లో ముత్యాలమ్మ గుడి వద్ద పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. సీఎం జగన్‌పై ప్రతిపక్ష రాళ్ల దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యానికే ఇది ఒక మచ్చ అని అన్నారు. ఇది నూటికి నూరుశాతం ప్రతిపక్ష కుట్ర అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా కార్యకర్తలు జరిగిన ఘటనపై సంయమనం పాటించి, ప్రజల మన్నలను పొందేందుకు పార్టీ కేడర్ సైనికుల్లా పనిచేయాలని పిలుపు నిచ్చారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ నల్లి మోహన్, మహిళా ప్రతినిధి పెదపాటి నాగలక్ష్మి, నాయకులు గొల్లపల్లి శ్రీధర్, ఈద రవిరెడ్డి, బందారు కాశీ, నల్లి రక్షణ పాల్గొన్నారు. అంబేద్కర్ జయంతిని ఆదివారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు నాయకులు, అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే వేడుకల్లో తీన్‌మార్ డప్పులతోను, జై భీమ్ నినాదాలతో చిన్నారులు, యూత్ సెంటర్లో సందడి చేశారు.

కొత్తపేటలో..

కొత్తపేట: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ జయంతిని ఆదివారం కొత్తపేటతో పాటు మండలంలో పలు గ్రామాల్లో దళిత సంఘాలు, దళిత ఐక్యవేదిక, వివిధ రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్, కమ్మిరెడ్డిపాలెం, బండారుపేటతో సహా మండలంలోని పలు గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు, స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్ వద్ద చిత్రపటానికి అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఎంపీపీ కార్యాలయం వద్ద ఎంపీపీ మార్గన గంగాధరరావు ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి నిర్వహించారు. జెడ్పీటీసీ గూడపాటి రమాదేవి స్థానిక గోగివారిపేటలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పి.గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి అన్నారు. అంబాజీపేటలో అంబేద్కర్ జయంతి వేడుకలను వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ వద్ద, నాలుగు రోడ్ల సెంటర్‌లో అంబాజీపేట అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు, మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరిదేవి, రాష్ట్ర బ్రాహ్మణ సంఘ చైర్మన్ పీకే రావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, వక్కలంకలో సర్పంచ్ వాసంశెట్టి రేవతి, పార్టీ నాయకులు వాసంశెట్టి పెదబాబులు అంబేద్కర్ జయంతి నిర్వహించారు.

రావులపాలెంలో..

రావులపాలెం: తన రాజ్యాంగ రచనతో దేశానికి దిశ నిర్దేశికుడిగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ నిలిచారని కొత్తపేట ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆదివారం అంబేద్కర్ జయంతి సందర్భంగా రావులపాలెం కోనసీమ ముఖద్వారం వద్ద, ఇందిరా కాలనీ పార్కు వద్ద ఆ మహనీయుడి విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి అంబేద్కర్ అభిమానులకు పంచారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, కో నాల రాజు, వైవీ, గొల్లపల్లి భాగ్యరావు పాల్గొన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: అంబేద్కర్ అడుగు జాడల్లో అందరూ పయనించి, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. స్థానిక మూడు రోడ్ల సెంటర్లో మండల అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కోట విజయభాస్కర్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో విప్పర్తి పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, మండల పార్టీ నక్కా వెంకటేశ్వరరావు, నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, సాధనాల రమేష్, దాసరి కాశీ తదితరులు అంబేద్కర్‌కు నివాళులు అర్పించారు.

బట్టేలంకలో..

మలికిపురం: అంబేద్కర్‌తోనే సమాజం పురోగతి చెందిందని రాజోలు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఆదివారం మండలంలోని బట్టేలంకలో అంబేద్కర్ జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గెడ్డం రమేష్, తోట దీపక్, తోట అభిషేక్ కుమార్, కుసుమ కిషోర్, శివ పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు అంబేడ్కర్



తాటిపాకలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి

రాజోలు: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆదర్శనీయుడని రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఆదివారం తాటిపాక సెంటర్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజోలు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో సీనియర్ సివిల్ జడ్జి ప్రమీలారాణి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజోలు, తాటిపాక, పొదలాడ, చింతలపల్లి, కడలి, ములికిపల్లి, పొన్నమండ, శివకోడు గ్రామాల్లో అంబేద్కర్ యూత్‌ల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహిచారు.

ముక్తేశ్వరంలో..

అయినవిల్లి: నేటి యువత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అడుగు జాడల్లో నడవాలని వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజక వర్గం ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. ఆదివారం అయినవిల్లి మండల ముక్తేశ్వరంలో సెంటర్‌లోని అంబేద్కర్ జయంతి కార్యక్రమంలో భాగంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లోను, అయినవిల్లి, నేదునూరు, వీరవల్లిపాలెం, శానపల్లిలంక, విలస, మాగాం తదితర గ్రామాల్లో అంబేద్కర్ జయంతి కార్యక్రమాలను జరిపారు.

ఆత్రేయపురంలో..

ఆత్రేయపురం: అంబేద్కర్ ఆలోచనలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని కొత్తపేట ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని ఆత్రేయపురం, పులిదిండి గ్రామాల్లో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ఆదివారం ఆయా గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం చిన్న హరిన వాడలో క్రీడా పోటీలకు అవసరమైన వాలీబాల్ క్రీడా మైదానం తయారు చేయించి వాలీబాల్ కిట్స్‌ను ఆయన చేతుల మీదుగా అందజేశారు. ర్యాలీలో అంబేద్కర్ నిలువెత్తు విగ్రహానికి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, పల్నాటి జయపాల్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బూటకపు హామీలు, అసత్య ప్రచారాలే టీడీపీ అజెండా



దేవరపల్లిలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి



పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

- వైఎస్సార్ సీపీ కొత్తపేట ఎమ్మెల్యే అభ్యర్థి జగ్గిరెడ్డి
- దేవరపల్లి గ్రామంలో ఇంటింటి ప్రచారం

రావులపాలెం: మండలంలో దేవరపల్లి గ్రామ శివారు మట్టలదొడ్డిలో ఆదివారం వైఎస్సార్ సీపీ కొత్తపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి ఇంటింటికీ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు అందించిన లబ్ధిని వివరించి, వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. గ్రామంలో పర్యటించిన వారికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. జగనన్న ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అర్హులైన అందరికీ అందించారని, జరగనున్న ఎన్నికల్లో గెలవబోయేది జగనన్న ప్రభుత్వమే అని, మరలా అధికారంలోకి వచ్చి అభివృద్ధి, సంక్షేమం ప్రజలందరికీ అందిస్తామని, టీడీపీ నాయకులు పూటకో మాట, రోజుకో వేషం అజెండాగా ప్రజలను మోసం చేయడమే పనిగా పెట్టుకున్నారని, టీడీపీ పాలనలో ప్రజలను మోసం చేసి మేనిఫెస్టో మాయం చేశారని, మరలా అధికారమిస్తే ప్రజల నెత్తిన జన్మభూమి కమిటీలు తాండవం చేస్తాయన్నారు. దేవరపల్లిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేసింది, చేస్తుంది మేమే అని ప్రజలకు వివరించారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

మండలంలోని పొడగట్లపల్లి గ్రామ శివారు జుత్తిగపాడుకు చెందిన పలువురు ఆదివారం వైఎస్సార్ సీపీలోకి చేరారు. ఆ ప్రాంతానికి చెందిన కళిరెడ్డి ఆదినారాయణ, జవ్వాది వెంకన్న, తలాటి ప్రసాద్, పులగం పెదకాపు, పులగం బలరాముడు, కొండిపర్తి త్రిమూర్తులు, కాకులపాటి రాంబాబు, అత్తిలి శ్రీను, అల్లపల్లి వెంకన్న తదితరులు కొత్తపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలోకి చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం ఉంటుందని, ప్రజలకు మంచి చేసే పార్టీ కేవలం ఒక్క వైఎస్సార్ సీపీ మాత్రమే అన్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణుల ఖండన

కొత్తపేట: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నాన్ని వైఎస్సార్ సీపీ శ్రేణులతో పాటు సర్వత్రా ప్రజానీకం తీవ్రంగా ఖండించారు. విజయవాడలో సీఎం జగన్ బస్‌యాత్ర కొనసాగుతుండగా పదునైన వస్తువుతో హత్యాయత్నంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

కూటమి కుట్రలో భాగమే..



సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం ముమ్మాటికీ ప్రతిపక్ష టీడీపీ కూటమి కుట్రలో భాగమే. టీడీపీ, జనసేన, బీజేపీ కలసినా వారి సభలకు ఎక్కడా కనిపించని ప్రజా స్పందన జగన్ నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ సభలకు తరలి రావడాన్ని చూసి తట్టుకోలేకపోతున్నారు. జగన్ ప్రచారాన్ని అడ్డుకోవాలనే కుట్రతోనే హత్యాయత్నానికి పాల్పడ్డారు.

– గొల్లపల్లి డేవిడ్‌రాజు, అముడా చైర్మన్, కొత్తపేట

ఓటమి భయంతోనే హత్యాయత్నం



రాష్ట్రంలో 2019 ఎన్నికల్లో ఫలితాలను మించి వైఎస్సార్ సీపీ స్థానాలు కైవసం చేసుకోవడం ద్వారా మళ్లీ ఘోర ఓటమి భయంతో టీడీపీ, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నానికి పాల్పడింది. గతంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయని సంక్షేమ పథకాలతో ప్రజాదరణ పొందిన సీఎం జగన్ సభలకు ఎక్కడికక్కడ జనవాహిని తరలిరావడంతో ఆ ప్రచారాన్ని అడ్డుకోవాలనేదే ప్రతిపక్షాల పథకం. అదృష్టవశాత్తూ సీఎంకు పెద్ద ప్రమాదం తప్పింది.

– మార్గన గంగాధరరావు, ఎంపీపీ, కొత్తపేట

చంద్రబాబు ప్రోద్బలంతోనే..



సీఎం జగన్‌పై హత్యాయత్నం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. జగన్‌పై హత్యాయత్నం చేయాల్సిన అవసరం ఇంకెవరికి ఉంటుంది? ఇది టీడీపీ అధినేత చంద్ర బాబు ప్రోద్బలంతోనే జరిగి ఉంటుంది. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో ప్రజాభిమానం జగన్‌కే ఉంది. ఆయన సభలకు, బస్సు యాత్రకు లక్షలాదిగా జనం తరలిరావడంతో జగన్‌ను అడ్డుకోవాలనే కుట్రలో భాగమే ఈ హత్యాయత్నానికి పాల్పడ్డాయి.

– గూడపాటి రమాదేవి, జెడ్పీటీసీ, కొత్తపేట

ప్రజాదరణ చూసి తట్టుకోలేక..



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి లభిస్తున్న ప్రజాదరణ చూసి తట్టుకోలేక ప్రతిపక్ష టీడీపీ నేతలు కుట్ర పన్నారు. సిద్ధం సభలు, బస్సు యాత్ర ప్రారంభం నుంచీ ప్రతి సభ, ప్రతీ రోడ్ షో కు అపూర్వ రీతిలో ప్రజలు తరలివస్తున్నారు. దాంతో మళ్లీ వైఎస్సార్ సీపీ ఘన విజయం ఖాయమని తేలిపోయింది. దాంతో బెంబేలెత్తిన టీడీపీ జగన్ ప్రచారానికి ఆటంకాలు సృష్టించాలనే కుట్రలో భాగంగానే ఈ హత్యాయత్నానికి పాల్పడింది.

– ముత్యాల వీరభద్రరావు, పార్టీ మండల కన్వీనర్, కొత్తపేట

ఠారెత్తిస్తున్న ఎండలు

- మే నెల ముందే వచ్చిందా అన్నట్లుగా వేడి
- ఎండ వేడిమికి తోడైన వడగాడ్పులు



కె.పెదపూడిలో వేసవి ధాటికి నిర్మానుష్యంగా ప్రధాన రహదారి

అంబాజీపేట: ఏటికేటికి ఎండాకాలం ముందుకు జరుగుతున్నట్లు వాతావరణం కనిపిస్తోంది. మే నెలలో కాయాల్సిన ఎండలు ముందే పలకరిస్తున్నాయి. వీటికి తోడు వేడిగాలలు ప్రజాజీవనాన్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. భూ తాపం కారణంగా సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని వాతావరణ శాఖ చెబుతోంది. వచ్చే నాలుగురోజుల్లో సాధారణం కంటే నాలుగు డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు పెరిగే సూచన ఉందని, ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ ముందస్తు సూచికలు జారీ చేసింది. వేసవిలో కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకోకపోతే వడదెబ్బ తగిలి ప్రాణాలు పోయే ప్రమాదముంది. పి.గన్నవరం, రాజోలు, కొత్తపేట నియోజకవర్గాల్లో ఎండలు మండుతున్నాయి. ఓపక్క పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. భానుడి ప్రతాపం పది రోజుల నుంచి రోజురోజుకీ పెరుగుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొమ్మిదైతే చాలు ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు భయపడాల్సిన పరిస్థితి. కూలీ పనులు, వ్యవసాయ పనులు చేసుకునే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బయట ఎండల వల్ల విపరీతమైన ఉక్కపోత, వేడిగాలి తాళ్లలేక పొలాల్లో నీడల్లో సేద తీరుతున్నారు. వృద్ధులు, పిల్లలు, బాలింతలు, గర్భిణులు మరింత ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మండలంలో గత నాలుగు రోజులగా 39 డిగ్రీల నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. దీంతో రోడ్లపై ప్రయాణించ లేక వాహన చోదకులు ఎక్కడ చెట్ల నీడ కనిపిస్తే అక్కడ ఆగి సేదతీరుతున్నారు. వాతావరణం చల్లబడిన వేళలో మళ్లీ ప్రయాణం ప్రారంభిస్తున్నారు. ఇదే విధంగా రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరిగితే ప్రజలకు వడ దెబ్బ తగిలే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. వీలున్నంత వరకు నీడ ప్రదేశాల్లో ఉండాలని, మంచినీరు, మజ్జిగ, కొబ్బరి బొండాలు తాగితే మంచిదని సూచిస్తున్నారు. సమయానికి భోజనం చేయాలని, పిల్లలు, వృద్ధులు ఎండల్లో తిరగకూడదని తెలిపారు.

నూకాంబిక ఆలయానికి భక్తుల తాకిడి



చింతలూరులో ఏర్పాటు చేసిన చలివేంద్రంలో భక్తులకు మజ్జిగ అందజేస్తున్న దాత తదితరులు

ఆలమూరు: చింతలూరు నూకాంబిక అమ్మవారి జాతర, తీర్థోత్సవాలకు సంబంధించి భక్తుల తాకిడి కొనసాగుతుంది. అమ్మవారి ఉత్సవాలు ప్రారంభమై వారం రోజులు పూర్తవుతున్నా భక్తుల రద్దీ మాత్రం తగ్గడం లేదు. ఆదివారం కావడంతో సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు రాగా ఆలయంలోని క్యూలు కిక్కిరిసిపోయాయి. భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించి మొక్కులను తీర్చుకున్నారు. మహిళలు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలను అందజేశారు. చిన్నారులు, బాల, బాలికలు జెయింట్‌వీల్, కొలంబస్, రంగులరాట్నాలను ఎక్కేందుకు ఆసక్తి కనబర్చారు. తీర్థ మహోత్సవాలను పురస్కరించుకుని ఆలయం వద్ద పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. తీర్థంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తును కొనసాగిస్తున్నారు. పంచాయతీ కార్మికులు తీర్థంలో పేరుకుపోతున్న చెత్త, చెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి పారిశుధ్యాన్ని చర్యలు తీసుకుంటున్నారు.

చలివేంద్రం ఏర్పాటు

కొత్తూరు-వెదురుమూడి రోడ్డులోని చింతలూరులోని వెంకటేశ్వర నగర్‌లో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు జరిగింది. చింతలూరులోని నూకాంబిక అమ్మవారి ఆలయానికి విచ్చేసే భక్తుల దాహార్తిని తీర్చేందుకు సంధిపూడికి చెందిన దాత నరకుల దుర్గాప్రసాద్ ఈ మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అలాగే స్థానిక వేంకటేశ్వర ఆలయం వద్ద గోశాల-గోపరంధామం ఆధ్వర్యంలో నిత్యమజ్జిగ చలివేంద్రం కొనసాగుతుంది.